
సాక్షి
కాకినాడ
బుధవారం । 25 । జనవరి । 2023



నిత్యాన్నదానానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కారుకొండ రమేష్ చౌదరి (మండపేట) రూ.67,500 విరాళం సమర్పించారు.



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 9,250 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 6.75 అడుగులకు చేరింది.

జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రారంభం



జాతీయ ఇంజినీరింగ్ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్-2023 మంగళవారం ప్రారంభమయ్యాయి.

8లో

న్యూస్‌రీల్

సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా వీరభద్రుడు



సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వీరభద్రుడు

కాకినాడ లీగల్: కాకినాడ ఒకటో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా హెచ్ వీరభద్రుడు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన న్యాయశాఖలో 1985లో కాకినాడలో విధుల్లో చేరి వివిధ హోదాల్లో పనిచేశారు. మూడో అదనపు జిల్లా కోర్టు సీనియర్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించారు. 2020లో వీరభద్రుడు ఉద్యోగ విరమణ చేశారు. ఇటీవల ఆయనను సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా నియమిస్తూ ప్రభుత్వ న్యాయశాఖ కార్యదర్శి జి. సత్య ప్రభాకర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు.

స్కానింగ్ సెంటర్లపై నిఘా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జిల్లాలో లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న మండలాల్లోని స్కానింగ్ సెంటర్లపై మహిళా పోలీసు, ఐసీడీఎస్ అధికారులు సంయుక్తంగా డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 75 డెకాయ్ ఆపరేషన్లు చేశామన్నారు. ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లలో ఎక్కడా లింగ నిర్ధారణ చేయడం లేదన్నారు. ఇప్పటి వరకు 354 స్కానింగ్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. రెండు స్కానింగ్ సెంటర్లకు రెన్యూవల్, 10 స్కానింగ్ సెంటర్లలో మెషీన్ మార్పులు, చేర్పులు, చిరునామా మార్పులకు ఆమోదం తెలిపినట్లు వివరించారు. జిల్లా వైద్యాధికారి ఎం.శాంతిప్రభ మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ చట్టంపై అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రచారం చేస్తామన్నారు. ఏఎస్పీ పి.శ్రీనివాస్, మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రీజనల్ డైరెక్టర్ పి.పద్మాశశిధర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ హేమలతాదేవి, వైద్యులు బి.విష్ణువర్ధిని, ఐ.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

కాకినాడ సిటీ: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కాకినాడ పీఆర్ కళాశాలలో మధ్యాహ్నం ఒంటిగంటకు జిల్లా స్థాయి ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ ఎం రవీంద్రనాథ్‌బాబు పాల్గొంటారు.

రైఫిల్ షూటింగ్ పోటీలకు సాయి తన్మయి



క్రీడాకారిణి తన్మయి

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ రైఫిల్ షూటింగ్ పోటీలకు కాకినాడకు చెందిన పి.సాయి తన్మయి ఎంపికైంది. స్థానిక జిల్లా క్రీడా మైదానంలో రైఫిల్ షూటింగ్ అకాడమీలో కోచ్ సమీర్ వద్ద శిక్షణ పొందుతున్న తన్మయి ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈనెల 23న జరిగిన ఎంపికల్లో పాల్గొంది. రైఫిల్ విభాగంలో స్వర్ణ పతకం సాధించింది. ఆదిత్య డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. ఉత్తరప్రదేశ్‌లో ఫిబ్రవరి 19 నుంచి 23 వరకు జాతీయ పోటీలు జరుగుతాయి. ఈ పోటీలలో నన్నయ తరుపున తన్మయి ఆడుతుంది. యూనివర్సిటీ స్థాయిలో బంగారు పతకం సాధించిన తన్మయను మంగళవారం డీఎస్‌ఏ చీఫ్‌కోచ్ శ్రీనివాస్, కోచ్ సమీర్‌లు అభినందించారు.

దిశ వన్‌స్టాప్ సెంటర్ పరిశీలన

కాకినాడ లీగల్: కాకినాడ ప్రభుత్వాస్పత్రిలోని దిశ వన్‌స్టాప్ సెంటర్‌ను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి మంగళవారం సందర్శించారు. ఈ సెంటర్‌ను ఆశ్రయించిన వివరాలు, రికార్డులు పరిశీలించారు. బాధితుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. దిశ వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ శైలజ, న్యాయవాది నాగజ్యోతి, పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక పథం.. ఉపాధి రథం



- జిల్లాలో వివిధ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహం
- అందిపుచ్చుకుంటున్న ఔత్సాహికులు
- పరోక్షంగా ఉపాధికి బాటలు వేస్తున్న ప్రభుత్వం
- మూడేన్నరేళ్లలో 9 పెద్ద పరిశ్రమల ఏర్పాటు
- తీరంలో విరివిగా రొయ్యల ప్రొసెసింగ్ యూనిట్లు
- ఎంఎస్ఎంఈల ద్వారా 16,394 మందికి ఉపాధి

సంవత్సరం	ఎంఎస్ఎంఈలు	ఉపాధి
2019	265	1707
2020	119	978
2021	720	4254
2022	2412	9455

కాకినాడ రూరల్: జిల్లాలో పారిశ్రామిక రంగం పరుగులు పెడుతోంది. వ్యవసాయానికి అనుగుణంగా ఆక్వా రంగం పుంజుకుంది. ఫలితంగా ఆక్వా ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పడుతున్నాయి. ఇవి వేలాది మందికి ఉపాధి బాటలు వేస్తున్నాయి. తుని నుంచి మొదలుకుని తాళ్లరేవు వరకు విశాల తీర ప్రాంతం కలిగిన జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2019 నుంచి చిన్నా చితకాతో పాటు వివిధ పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనేది ముఖ్యమంత్రి ఆశయం. గడిచిన మూడున్నరేళ్లలో రూ.795 కోట్లతో 3496 మందికి ఉపాధి కల్పించేలా తొమ్మిది పెద్ద పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. వాటిలో ఐదు రొయ్యలు ప్రాసెసింగ్‌కు సంబంధించినవి కావడం విశేషం.

జోరుగా ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు

▶▶ ప్రోసెసింగ్ యూనిట్ల ద్వారా రోజుకు 232 టన్నుల రొయ్యలను ఎగుమతుల కోసం శుద్ధి చేస్తున్నారు. ఆయా యూనిట్ల కోసం రూ.330 కోట్ల పెట్టుబడి పెట్టారు.

▶▶ ప్రభుత్వం ద్వారా యూనిట్ల ఏర్పాటుకు అనేక రాయితీలు అందుతున్నాయి. ప్రోసెసింగ్ యూనిట్ల ద్వారా సుమారు 2956 మంది నేరుగా ఉపాధి పొందుతున్నారు.



పొన్నాడ వద్ద కేఎస్ఈజెడ్‌లో ఏర్పాటు చేసిన దేవీ ఆక్వాటిక్ రొయ్యల ప్రోసెసింగ్ యూనిట్

▶▶ పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలం కేఎస్ఈజెడ్‌లోని పొన్నాడ వద్ద రూ.60 కోట్లతో దేవీ ఆక్వాటిక్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటైంది. ఇందులో 756 మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

▶▶ పెద్దాపురం నియోజవర్గం జి.రాగంపేట వద్ద రూ.90 కోట్లతో అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ లిమిటెడ్ ఏర్పాటు చేశారు. ఈ సంస్థలో 350 మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

▶▶ కేఎస్ఈజెడ్, పొన్నాడ వద్ద రూ.90 కోట్లతో సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ఆవిర్భవించింది. ఈయూనిట్లో వెయ్యి మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

▶▶ ప్రత్తిపాడు మండలం లంపకలోవ వద్ద రూ.30 కోట్లతో ఏర్పాటైన వీరభద్ర ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో సుమారు 350 మంది ఉపాధి పొందుతున్నారు.

▶▶ కేఎస్ఈజెడ్, పొన్నాడ వద్ద రూ.70 కోట్లతో కోస్టల్ కార్పొరేషన్ లిమిటెడ్ నెలకొల్పారు. ఇందులో 500 మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

ఎంఎస్ఎంఈలకు పెద్ద పీట

రాష్ట్రంలో 2019 నాటికి అమలులో ఉన్న పారిశ్రామిక విధానంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పలు మార్పులు తీసుకువచ్చింది. ఔత్సాహికులకు ప్రోత్సాహాన్ని, రాయితీలు కల్పించేలా విధానాన్ని మార్చారు. ఈ మార్పుల ఫలితంగా సర్వీసు సెక్టార్‌లో ఉన్న వారికి కూడా ఉపాధి బాటలు పడ్డాయి. 2019 నుంచి ఇప్పటి వరకు రూ.390 కోట్లతో 3516 మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) యూనిట్లు ఏర్పాటయ్యాయి. ఈ యూనిట్ల ద్వారా సుమారు 16,394 మంది ఉపాధి పొందుతున్నారు. 2019-20లో 265 యూనిట్ల ద్వారా 1707మందికి, 2020-21లో 119 యూనిట్ల ద్వారా 978 మందికి, 2021-22లో 720 యూనిట్ల ద్వారా 4254 మందికి, ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి నాటికి 2412 యూనిట్లతో 9455 మందికి రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహాన్ని అందించింది. పరోక్షంగా మరికొంత మందికి ఉపాధికి కల్పించింది. పరిశ్రమలు నెలకొల్పే ఆసక్తి ఉన్నవారికి అవగాహన కల్పిస్తున్నట్లు పరిశ్రమల శాఖ ఏడీ కృష్ణార్జునరావు తెలిపారు.

మెరుగైన ఉపాధి అవకాశాలు



రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అనేక విధాలుగా ప్రోత్సాహాన్ని అందిస్తోంది. పరిశ్రమ నెలకొల్పాలని ముందుకు వచ్చే వారికి సింగిల్ విండో ద్వారా అన్ని అనుమతులు సకాలంలో మంజూరు చేస్తోంది. రాయితీల రూపంలో అనేక విధలుగా ఆర్థికంగా దన్నుగా నిలుస్తోంది. ఈ అవకాశాలను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు సద్వినియోగం చేసుకోవాలి. తద్వారా స్వయం ఉపాధిని పొందడంతో పాటు నిరుద్యోగులకు ఉపాధిని కల్పించాలి.
– టి.మురళి, పరిశ్రమల శాఖ జీఎం

28 నుంచి బాలాలయంలో తలుపులమ్మ దర్శనాలు

- రెండు రోజులు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు
- చురుగ్గా నిర్మాణ పనులు



శరవేగంగా నిర్మిస్తున్న తలుపులమ్మ తల్లి బాలాలయం

తుని రూరల్: బాలాలయంలో ఈనెల 28వ తేదీ ఉదయం 11 గంటల నుంచి తలుపులమ్మ అమ్మవారి దర్శనాలకు ఏర్పాట్లు చేశారు. రూ.ఐదు కోట్లతో తలుపులమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణం, మహామండప నిర్మాణం జరుగుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నారు. లోవ దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండపై అమ్మవారి దర్శనాలు నిలిపివేస్తున్నట్టు తెలిపారు. రెండు రోజులు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆగమ శాస్త్ర పండితుల సూచనలతో దేవస్థానం ప్రాంగణ మెట్లమార్గంలో పెద్ద అమ్మవారి విగ్రహం వద్ద బాలాలయంలో భక్తులకు దర్శన ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. అందులో భాగంగా ఉత్తరాయణ పుణ్యకాలంలో అమ్మవారి బాలాలయం ఏర్పాటు, పంచలోహ విగ్రహాల ప్రాంగణంలో కళాపకర్షణ, 27న మధ్యాహ్నం 2.45 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, ఉదక శాంతి జరుగుతాయన్నారు. 28న మృత్తికా పూజ, నవగ్రహ, వాస్తు, క్షేత్రపాలక, మండప ఆరాధన, ఉదయం 9.37 గంటలకు కలశ స్థాపన, నీరాజన మంత్ర పుష్పాలు, పూర్ణాహుతి జరుగుతాయన్నారు. ప్రధానాలయంలో ఎప్పటిలాగే ప్రాతఃకాల అర్చన, బాలభోగం, మహానివేదన, సాయంత్రం అవసర నివేదన, అనంతరం పూజలు ఏకాంతంగా నిర్వహిస్తామన్నారు. బాలాలయం నిర్మాణం, విగ్రహ ఏర్పాట్లు పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు.

బాలికల విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

బాలికా దినోత్సవంలో కలెక్టర్ కృతికా శుక్లా



బాలికా దినోత్సవలో విద్యార్థులు, అధికారులతో కలెక్టర్ కృతికా శుక్లా, ఏఎస్పీ శ్రీనివాస్ తదితరులు

కాకినాడ సిటీ: చిన్నప్పటి నుంచి విద్య, ఆరోగ్యంపై శ్రద్ధ పెడుతూ పౌష్టికాహారం తీసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా బాలికలకు సూచించారు. రక్తహీనత లేకుండా చూసుకోవాలన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆడపిల్లలు బాగా చదివి ఆరోగ్యం పెంపొందించుకోవాలన్నారు. దిశ యాప్ గురించి ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని అధికారులను కోరారు. బాలికా సంరక్షణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, సాంస్కృతిక కార్యక్రమంలో విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. పీసీ, పీఎన్‌డీ యాక్ట్ అమలులో అత్యుత్తమ సేవలు అందించిన ఇద్దరు మెడికల్ ఆఫీసర్లకు.. ఇద్దరు ఏఎన్ఎంలు, ఇద్దరు ఆశ కార్యకర్తలకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ పి పద్మా శశిధర్ మాట్లాడుతూ వివక్ష లేకుండా ప్రతి కార్యక్రమంలో ఆడ పిల్లల ప్రాముఖ్యతను గుర్తించేలా మగ పిల్లలకు తెలియజేయాలన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం శాంతి ప్రభ మాట్లాడుతూ కౌమారదశలో ఉన్న బాలికలు ఆరోగ్యం, విద్య, క్రీడల్లో భాగస్వాములై అన్ని రంగాల్లో ముందుకు సాగాలన్నారు. బాల బాలికలచే సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఏఎస్పీ పి.శ్రీనివాస్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, వైద్యాధికారులు బి.విష్ణువర్ధని, ఐ.ప్రభాకర్, సుదీప్తి, సత్యనారాయణ, ఎస్.అప్పలనాయుడు, బీబీ, బి.ప్రియాంబిక పాల్గొన్నారు.

విజేతలైన వివిధ హైస్కూళ్ల విద్యార్థినులు

- వ్యాసరచన పోటీలు: కె.నిత్య (కాకినాడ గాంధీనగర్)కు మొదటి బహుమతిగా రూ.10వేలు, ఆర్ సుస్మిత ఏంజిల్ (సామర్లకోట మండలం మాధవపటన్నం)కు రెండో బహుమతిగా రూ. 5వేలు, కె.సంజన (కాకినాడ జగన్నాథపురం) మూడో బహుమతిగా రూ. 3 వేలు ఆర్థిక సాయం అందించారు.
- వక్తృత్వ పోటీ: పి.అఖిలశ్రీ (కాకినాడ సాలిపేట)కి మొదటి బహుమతిగా రూ. 10వేలు, వి.విస్సు (కాకినాడ గాంధీనగర్)కు రెండో బహుమతి రూ. 5 వేలు, కె.జెరూస్థప్రణతి (సామర్లకోట మండలం మాధవపట్నం)కు మూడో బహుమతిగా రూ. 3 వేలు ఆర్థిక సాయాన్ని అధికారులు అందజేశారు.
- పెయింటింగ్ పోటీ: ఎస్‌కె అబ్దుల్ హమీద్ (కాకినాడ ఆనందభారతి)కి మొదటి బహుమతిగా రూ. 10 వేలు, పి.మణిసంజన (కాకినాడ శ్రీరామ్‌నగర్) రెండో బహుమతిగా రూ.5 వేలు, ఎస్.నాహగ్రేస్ (సామర్లకోట మండలం మాధవపట్నం)కు మూడో బహుమతి కింద రూ. 3 వేలు అందజేశారు.

కాగా కాకినాడ డివిజన్‌కు చెందిన మల్లం పీహెచ్‌సీ వైద్యాధికారి జి.అనురాధ, పండూరు ఏఎన్ఎం కాకదకుమారి, యు.కొత్తపల్లి ఆశా వర్కర్ ముప్పిడి ఆశా జ్యోతి, పెద్దాపురం డివిజన్ కాండ్రకోటకు చెందిన వైద్యాధికారి సిహెచ్ ధనలక్ష్మి, ఏలేశ్వరం ఏఎన్ఎం మర్రి చిన్నమ్ములు, మల్లిసాల ఆశా వర్కర్ చిత్రాడ మంగలకు ప్రసంసా పత్రాలు, మెమొంటోలు అందజేశారు.


ఖాతాదారులకు గోల్డ్‌మాల్

- 40 మందికి బ్యాంకు ఉద్యోగి టోకరా
- బంగారం రుణం పేరుతో రూ.2.5 కోట్ల దోపిడీ

కాకినాడ క్రైం: కాకినాడలోని యూకో బ్యాంకు కేంద్రంగా ఓ బ్యాంకు ఉద్యోగి రూ.2.5 కోట్ల భారీ మోసానికి పాల్పడి 40 మంది ఖాతాదారులకు కుచ్చుటోపీ పెట్టాడు. వివరాల్లోకి వెళితే, నగరంలోని ఆనంద భారతి మైదానం ఎదురు వీధిలో ఉన్న సూర్యారావుపేట యూకో బ్యాంకులో కాకినాడ రామకృష్ణారావు పేటకు చెందిన తాడోజు శ్రీనివాస రావు పదేళ్లుగా గోల్డ్ లోన్ విభాగంలో అప్రయిజర్‌గా పనిచేస్తున్నాడు. కొన్నాళ్లుగా చేతి వాటం ప్రదర్శించి సుమారు 40 మంది ఖాతాదారులను నిలువునా ముంచాడు. వారిలో కొందరి అసలు బంగారాన్ని పక్కదారి పట్టించి ఆ స్థానంలో నకిలీ బంగారాన్ని తీసుకొచ్చి గుట్టు చప్పుడు కాకుండా బ్యాంకులో పెట్టాడు. మరికొందరి పరిచయాలను ఆసరాగా చేసుకొని రకరకాల కారణాలను సాకుగా చూపి కొత్త నాటకానికి తెరతీశాడు. తన వద్ద బంగారం ఉందనీ, అయితే తమ బ్యాంకులో తమకి లోన్ ఇవ్వరనీ నమ్మబలికాడు. కాబట్టి మీ డాక్యుమెంట్లతో లోన్ తీసుకుంటాననీ, తన బంగారం తానే తాకట్టు పెట్టుకుంటానని నమ్మించాడు. బ్యాంకుకి వచ్చి సంతకం చేస్తే చాలనీ ..వచ్చే లోన్‌లో కొంత మొత్తాన్ని పర్సంటేజ్‌గా ఇచ్చేస్తానని ఎరవేశాడు. శ్రీనివాస్ మోసాన్ని గుర్తించలేకపోయిన పలువురు ఖాతాదారులు అతడి వలలో చిక్కుకొని సంతకాలు పెట్టి బాధ్యులయ్యారు. భారీ మోసంలో బాధితులయ్యారు. లాకర్ తనిఖీలలో బంగారం నాణ్యతపై అనుమానం వచ్చిన బ్యాంకు యాజమాన్యం ఖాతాదారులకు 'మీ ఆభరణాలు నకిలీవి' అంటూ నోటీసులు జారీ చేసింది. దీంతో ఖాతాదారులంతా మూడు రోజులుగా బ్యాంకుకు క్యూ కట్టారు. నకిలీవి అయితే లోన్ ఎలా ఇచ్చారంటూ ఖాతాదారులు సంధించిన ప్రశ్నలకు బ్యాంకు అధికారులు నీళ్లు నములుతున్నారు. ఈ తంతులో శ్రీనివాస్ నిర్వాకంపై అనుమానం వచ్చిన బ్యాంకు యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారమంతా బట్టబయలైంది. నిందితుడు శ్రీనివాస్ రూ.2.5 కోట్ల మోసానికి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. బ్యాంకు నుంచి ఇంటికి వెళ్లే మార్గంలో ఏకంగా ఓ బంగారం దుకాణాన్నే పెట్టేశాడు. దుకాణం కేంద్రంగానే క్రయవిక్రయాలకు అసలు బంగారాన్ని వినియోగించి భారీ స్థాయిలో బంగారం మోసానికి పాల్పడ్డాడని పోలీసులు భావిస్తున్నారు. కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బృందాలు విచారణ చేపడుతున్నాయి.

రీసర్వేలో పారదర్శకతకు పెద్దపీట

- ఈ ఏడాది డిసెంబర్‌కు రీసర్వే పనులు పూర్తి
- రాష్ట్రంలో 2 వేల గ్రామాల్లో రెండో దశ భూసర్వే
- సీఎం ప్రధాన సలహాదారు అజయ్ కల్లం
- కలెక్టరేట్‌లో నాలుగు జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం ప్రధాన సలహాదారు అజయ్ కల్లం

సాక్షి, రాజమహేంద్రవరం/సీటీఆర్ఐ: భూ వివాదాలకు తెరదించేందుకు రాష్ట్రంలో చేపడుతున్న రీసర్వేలో పారదర్శకత, జవాబుదారీతనానికి పెద్దపీట వేయాలన్నది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని, దానికి అనుగుణంగానే నిర్దిష్ట కాలవ్యవధిలో చట్టబద్ధతంగా సర్వే చేపట్టాలని ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు, వైఎస్సార్ జగనన్న భూహక్కు-భూరక్ష పథకం స్టీరింగ్ కమిటీ అమలు చైర్మన్ అజయ్ కల్లం సూచించారు. రీసర్వే పురోగతి, భవిష్యత్తు కార్యాచరణపై స్థానిక కలెక్టరేట్‌లో నాలుగు జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో మంగళవారం ప్రాంతీయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశం మధ్యాహ్నం 3 గంటల వరకు సాగింది. ఈ సుదీర్ఘ భేటీలో భూ సమస్యలకు సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు.

అర్జీలకు పూర్తిస్థాయి పరిష్కారం

అజయ్ కల్లం మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే 2 వేల గ్రామాలు పూర్తయ్యాయని, భూహక్కు పత్రాల పంపిణీ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలో రెండో దశలో రెండు వేల గ్రామాల్లో ఫిబ్రవరి నాటికి సర్వే పూర్తి చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలకు పూర్తిస్థాయిలో పరిష్కారం చూపాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారం సమయంలో జిల్లా ఉన్నతాధికారులు రికార్డుల పరిశీలనకే పరిమితం కాకుండా లబ్ధిదారుల భూమికి సంబంధించిన వాస్తవ పరిస్థితులను నిర్ధారించుకోవాలన్నారు. 2023 డిసెంబర్ నాటికి రీసర్వే పనులను పూర్తి చేసి, హక్కు పత్రాలు అందజేయడంలో సమన్వయంతో పనిచేయాలన్నారు. దీనిపై నెల కొన్న అనుమానాలను సీసీఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీసీఎల్ఏ కమిషనర్‌లతో మరోసారి చర్చించి పరిష్కారం చూపుతామన్నారు. సీసీఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మాట్లాడుతూ రీసర్వేలో రికార్డులను సమగ్రంగా తనిఖీ చేసి నిర్ణయం తీసుకోవాలన్నారు. పర్యవేక్షణలో అలసత్వం ప్రదర్శించకూడదన్నారు. క్షేత్ర స్థాయిలో రికార్డులను పరిశీలించి అక్కడికక్కడే తప్పులు సరిదిద్ది సమస్య పరిష్కరించాలని సూచించారు. సీసీఎల్ఏ కమిషనర్ సిద్ధార్థ జైన్ మాట్లాడుతూ సర్వే అధికారులకు వచ్చే సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నామన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందిని సమన్వయం చేసుకొనే దిశలో టెలికాన్ఫరెన్స్ పరిక రాలను సర్వేశాఖ ద్వారా అందజేస్తున్నట్లు చెప్పారు. మ్యూటేషన్ దరఖాస్తు ఆమోదించిన, తిరస్కరించిన కారణాలను అక్కడికక్కడే సమీక్షించాలన్నారు.

ఏడు మండలాల్లో రీసర్వే

కోనసీమ కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ ధ్యానచంద్

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని 7 మండలాల పరిధిలో ఉన్న 52 గ్రామాలు, 121 హాబిటేషన్లకు చెందిన గ్రౌండ్ ట్రూతింగ్ పనులు పూర్తి చేశాం. 62 మ్యూటేషన్, 65 క్లరికల్ తప్పిదాలు, 66 పాత సర్వే నెంబర్ల తప్పులు, 66 మిస్‌మ్యాచ్ అర్జీలకు పరిష్కారం చూపాం.

2,836 మ్యూటేషన్ అర్జీలకు పరిష్కారం

ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు జిల్లా పరిధిలో 689 గ్రామ పంచాయతీలో సర్వే చేయాల్సి ఉండగా.. తొలి దశలో 80 గ్రామాల్లో పూర్తి చేశాం. 24,506 జేబీహెచ్ పట్టాలకు గాను 20,385 పంపిణీ చేశాం. 2,836 మ్యూటేషన్ అర్జీలు, 526 క్లరికల్, 161 పాత సర్వే నెంబర్లు, 323 మిస్‌మ్యాచ్ అర్జీలను పరిష్కరించాం.

తూర్పులో 44 గ్రామాల్లో పూర్తి

– కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 272 గ్రామ పంచాయతీల పరిధిలోని 6,05,332 ఎకరాల్లో రీసర్వే చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. తొలి దశలో 44 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశాం. ఇందుకు సంబంధించి 19,865 జేబీహెచ్ (జగనన్న భూహక్కు) పట్టాలకు గాను 18,690 పంపిణీ చేశాం. మ్యూటేషన్ 2,768 అర్జీలు అందగా 2,300 పరిష్కరించాం. 1,967 వాటిల్లో చిన్నపాటి తప్పులు దొర్లాయి, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తాం. పాత సర్వే నంబర్లలో తప్పులు సరిదిద్దేందుకు 654, భూమి కొలతల్లో అసమతుల్యత (మిస్ మ్యాచ్)కు 206 అర్జీలను పరిష్కరించాం.

46,223 జేబీహెచ్ పట్టాల పంపిణీ

కాకినాడ కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఇలాక్కియ

కాకినాడ జిల్లా వ్యాప్తంగా తొలి దశలో 207 గ్రామాలకు గాను 128 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశాం. 49,658 జేబీహెచ్ పట్టాలకు గాను 46,223 పంపిణీ చేశాం. 110 మ్యూటేషన్ అర్జీలు పరిష్కరించాం. క్లరికల్ తప్పిదాలకు సంబంధించి 120, పాత సర్వే నంబర్లలో తప్పులు దిద్దే ప్రక్రియలో 120, మిస్ మ్యాచ్‌కు చెందిన 120 అర్జీలకు పరిష్కారం చూపాం.

క్రేన్ ఢీకొని వ్యక్తి మృతి

జగ్గంపేట: క్రేన్ ఢీకొన్న ఘటనలో ఓ మోటార్ సైక్లిస్ట్ దుర్మరణం పాలయ్యాడు. ఏఎస్సై నూకరాజు కథనం ప్రకారం.. తాళ్లూరుకు చెందిన సిద్దాబత్తుల అబ్బులు (45) రాజమహేంద్రవరంలో పాస్టర్‌గా పని చేస్తున్నాడు. మోటార్ సైకిల్‌పై మంగళవారం జగ్గంపేట వచ్చి, తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో స్థానిక విక్టరీ బజారు సమీపాన సర్వీసు రోడ్డులో వెనుక నుంచి వస్తున్న క్రేన్ అతడి మోటారు సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అబ్బులు అక్కడికక్కడే మృతి చెందాడు. వివాహితుడైన అతడికి ఇద్దరు సంతానం. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొని యువకుని మృతి

ప్రత్తిపాడు: జాతీయ రహదారి డివైడర్‌ను బైక్‌తో ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై కె.సుధాకర్ కథనం ప్రకారం.. కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామానికి చెందిన మూరా కిషోర్ (19) ప్రత్తిపాడు మండలం ధర్మవరంలోని తన బంధువుల ఇంటికి సోమవారం రాత్రి బైక్‌పై వచ్చాడు. తిరిగి మంగళవారం తెల్లవారుజామున స్వగ్రామానికి బయలుదేరాడు. జాతీయ రహదారిపై శ్రీపాదాలమ్మ అమ్మవారి ఆలయం సమీపాన బైక్ అదుపు తప్పడంతో డివైడర్‌ను ఢీకొని పడిపోయాడు. ఓపక్క చీకటి, దానికి చలి తోడవడంతో ఎవరూ అతడిని గుర్తించలేదు. కిషోర్ ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన అతడి సోదరుడు లోవరాజు ఉదయం ధర్మవరం వైపు వస్తూ డివైడర్ మధ్యలో మృతదేహాన్ని గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విధుల్లో చేరిన సబ్జెక్టు టీచర్లు

రాయవరం: పదోన్నతులు, మిగులు, సబ్జెక్టు కన్వర్షన్ ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సర్దుబాటు అయిన ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరారు. సర్దుబాటు ప్రక్రియలో భాగంగా ఈ నెల 22న రాజమహేంద్రవరంలో తూర్పు గోదావరి జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించిన విషయం పాఠకులకు విదితమే. సర్దుబాటు అయిన ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరాల్సి ఉన్నప్పటికీ సాంకేతిక కారణాలతో ఉత్తర్వులు విడుదల కాలేదు. వెంటనే విధుల్లో చేరాల్సిందిగా వారికి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పీఎస్ నుంచి గణితానికి కన్వర్షన్ కోరిన, పాఠశాలల్లో గణితం మిగులు ఉపాధ్యాయులుగా గుర్తించిన 161 మంది, వివిధ కారణాలతో మిగులుగా ఉన్న ఎస్ఏ ఇంగ్లిష్ 41, సోషల్ 82, బయలాజికల్ సైన్స్ 43 మందిని సర్దుబాటు చేశారు. అలాగే ఎస్జీటీలుగా పని చేస్తున్న వారి నుంచి ఎస్ఏ గణితం 110, సోషల్ 49, బయాలజీ 33, ఇంగ్లిష్ 254 మందిని వారు కోరుకున్న స్థానాల్లో సర్దుబాటు చేశారు. సబ్జెక్టు కన్వర్షన్, సబ్జెక్టు మిగులు ఉపాధ్యాయులుగా ఉన్న 327 మందిని, ఎస్జీటీ నుంచి సబ్జెక్టు ఉపాధ్యాయులుగా సర్దుబాటు చేసిన 446 మందిని వారు పని చేస్తున్న స్థానాల నుంచి ఇతర స్థానాల్లో సర్దుబాటు చేశారు. వీరందరూ సర్దుబాటు జరిగిన స్థానాల్లో విధుల్లో చేరారు.

సబ్జెక్టు టీచర్ల కొరత తీరింది



ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో గణితం, బయాలజీ, పీఎస్, ఇంగ్లిష్ సబ్జెక్టు పోస్టులు ఖాళీగా ఉండకూడదన్నది ప్రభుత్వ నిర్ణయం. అందుకే ఖాళీగా ఉన్న సబ్జెక్టు పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించాం. దీంతో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత పూర్తి స్థాయిలో తీరినట్లైంది.

– ఎస్.అబ్రహం, డీఈఓ, తూర్పు గోదావరి

77 ఖాళీ పోస్టులకు కౌన్సెలింగ్

ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో వివిధ సబ్జెక్టుల్లో ఖాళీగా ఉన్న 77 పోస్టులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇంకా ఖాళీలు మిగిలి ఉంటే అన్నీ భర్తీ అయ్యే వరకూ సీనియారిటీ ప్రకారం ఎస్జీటీలకు కౌన్సెలింగ్ నిర్వహించే అవకాశముంది.

జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రారంభం



సూరంపాలెం 'ఆదిత్య'లో పరీక్ష రాసి వస్తున్న అభ్యర్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ)/గండేపల్లి/కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జాతీయ ఇంజినీరింగ్ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్–2023 మంగళవారం ప్రారంభమయ్యాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యాన కంప్యూటర్ ఆధారంగా నిర్వహించే ఈ పరీక్ష కాకినాడ అయాన్ డిజిటల్ ఇనిస్టిట్యూట్, గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లలో నిర్వహించారు. అయాన్ ఇనిస్టిట్యూట్‌లో ఉదయం పరీక్షకు 516 మందికి గాను 513 మంది, మధ్యాహ్నం పరీక్షకు 515 మందికి గాను 509 మంది హాజరయ్యారు. సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో తొలి రోజు పరీక్షకు 115 మందికి గాను 114 మంది హాజరయ్యారు. ఇక్కడ పరీక్షల ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి, టెస్ట్ సెంటర్ అడ్మిన్‌గా ఎం.రాజబాబు వ్యవహరించారు. రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ కళాశాలలో ఉదయం పరీక్షకు 900 మందికి గాను 892 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 900 మందికి గాను 889 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలు ఈ నెల 25, 28, 29, 30, 31, ఫిబ్రవరి 1 తేదీల్లో కూడా జరుగుతాయి.

యువకుడి కిడ్నాప్

- రూ.30 లక్షలు ఇవ్వాలని తల్లిదండ్రులకు ఫోన్
- సమిశ్రగూడెంలో ఘటన



కిడ్నాపైన వెంకటేష్

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెంలో యువకుడి కిడ్నాప్ ఘటన కలకలం సృష్టించింది. పోలీసుల కథనం ప్రకారం.. కోరుపల్లికి చెందిన నిచ్చెనకోళ్ల రాము, అతడి కుమారుడు వెంకటేష్ (25) నిడదవోలులో కూరగాయల దుకాణం నిర్వహిస్తున్నారు. రోజూ మాదిరిగానే మంగళవారం ఉదయం 5 గంటలకు ఇంటి నుంచి దుకాణానికి బయలుదేరారు. వెంకటేష్ తన మోపెడ్‌లో పెట్రోల్ పోయించుకోవడానికి బంక్‌లో ఆగాడు. తండ్రి రాము నిడదవోలు వెళ్లిపోయాడు. ఈ నేపథ్యంలో సమిశ్రగూడెం – వేలివెన్ను మధ్య గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి వెంకటేష్‌ను కిడ్నాప్ చేశారు. అతడి మోపెడ్‌ను రోడ్డు పక్కన పడవేశారు. ఉదయం 7 గంటల సమయంలో వెంకటేష్ సెల్‌ఫోన్ నుంచి కిడ్నాపర్లు కాల్ చేసి రూ.30 లక్షలు డిమాండ్ చేశారని తండ్రి రాము పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలాన్ని ఏఎస్సై పరమహంస పరిశీలించి, కేసు నమోదు చేశారు. వెంకటేష్ ఆచూకీ కోసం రెండు పోలీసు బృందాలు ఏర్పాటు చేశారు.

నిజాయితీకి నిలువెత్తు చిరునామా..



తనూజను సత్కరిస్తున్న సీఐ వీరబాబు, ఎస్సై పరదేశి తదితరులు

అమలాపురం రూరల్: నిజాయితీకి నిలువెత్తు చిరునామాగా నిలిచింది ఆ మహిళ. అంబాజీపేట శివారు కోఠివారి అగ్రహారానికి చెందిన వృద్ధురాలు పేరి మృదులకుమారి అమలాపురంలోని ఓ బ్యాంక్‌లో సోమవారం రూ.1.42 లక్షలు డ్రా చేసింది. నగదు బ్యాగ్‌లో పెట్టుకుని ఆటోలో తిరుగు ప్రయాణమైంది. మార్గం మధ్యలో బండారులంకలో నగదు బ్యాగ్‌ను పడేసుకుంది. ఆ బ్యాగ్ బండారులంకకు చెందిన పెంటపాటి నాగ వెంకట తాయారు (తనూజ)కు దొరికింది. ఆమె ఎంతో నిజాయితీగా పోగొట్టుకున్న వారికి ఆ బ్యాగ్‌ను అప్పగించే ప్రయత్నం మొదలు పెట్టింది. మృదుల కుమారి ఫిర్యాదు మేరకు అమలాపురం పోలీసులు బండారులంక వచ్చిన విషయం తెలిసిన తనూజ.. వారికి బ్యాగ్ అందజేసింది. ఆమెను సీఐ వీరబాబు సత్కరించారు.